కథ

ఉదయపుటెండ ఆ కొండ మీద వెచ్చగా నాలుగు వైపులా పరుచుకుంటోంది. అన్నవరం సత్యనారాయణస్వామి దర్శనం కోసం ఆహ్లాదంగా మెట్లెక్కుతున్నారు భక్తులు. చకాచకా నడుస్తున్న మగవాళ్ళూ ఆగి ఆగి నాలుగు మెట్లెక్కి, ఒకసారి ఆగి దేవుడికి నమస్కరించుకుని, లెంపలేసుకుని, మళ్ళీ ఎక్కడం మొదలుపెట్టే ఆడవాళ్ళూ- తుర్రుమని పై వరకు పరుగెత్తుకెళ్లిపోయి, మూడేసి మెట్లు దిగుతూ, అమ్మానాన్నలతో కలిసి పైకి మళ్ళీ పరుగెడుతూ పిల్లలూ- అందరూ తళతళమెరిసిపోతున్నారు. తల స్నానాలు చేసి, పట్టుబట్టలు కట్టి, నగలూ నట్రా పెట్టి, చేతుల్లో సంచీలు, ప్లాస్టిక్ బుట్టలూ పట్టుకుని భక్తి శ్రద్ధలతో ఎక్కుతున్నారు.

# ఏకలవ్యం

## ఇంద్రగంటి జానకీబాల

పది మెట్లు ముందుగా ఎక్కేసి, కింద వెడల్పు మెట్టు పక్కన అరుగు మీద కూర్చున్న తల్లిని చూసి మళ్ళీ కిందికి దిగింది లలిత.

''ఏమే! ఎక్కలేకపోతున్నావా'' అంది తల్లి వైపు చూస్తూ. వసంత ముఖం అభిమానంతో మెరిసింది.

''అదేం లేదు. కాసేపు ఆగుదామనిపించీ..'' అంది.

''సర్లే- కాసిన్ని మంచినీళ్ళివ్వనా?'' అంది లలిత.

''పోనీ ఇవ్వు'' అంది.

లలిత లోపల్లోపల నవ్వుకుంటూ వాటర్‌బ్యాగ్ లోంచి నీళ్ళు గ్లాసులో పోసి తల్లికిచ్చింది.

''నీ వయసులో వుండగా, నేనూ వచ్చాను అన్నవరం, నేనూ, అమ్మ, నాన్న, అన్నయ్య, వదిన.. అందరం. అప్పుడు నేను ఇరవైసార్లు ఎక్కిదిగాను'' అంది వసంత.

''అవున్లే. అప్పుడు వేరు, ఇప్పుడు వేరూ'' అంది. ఇద్దరూ లేచారు.

''పక్కన చెట్లు, ఈ గాలి..పూలవాసనలు..పక్షులు.. ఎంత బాగుందే ఈ వాతావరణం'' అంది వసంత అటూ ఇటూ చూస్తూ, అప్పుడప్పుడు మెడ పైకెత్తి చిటారు కొమ్మల మీద నుంచి దూసుకొస్తున్న వెలుగు కిరణాల్ని చూస్తూ నెమ్మదిగా ఎక్కుతోంది.

''అరే.. సుభద్రత్తయ్యగారూ.. అవును..పక్కన మహేషే'' అంటూ ఉత్సాహంగా అడ్డంగా పరుగెత్తింది లలిత.

''ఎవరే..?'' అంటూ అక్కడే ఆగిపోయింది వసంత.

''నువ్వా లలితా.. ఎప్పుడొచ్చావూ'' అంటూ సుభద్ర దూరంగా అవతలి వైపున నిలబడ్డ వసంతని చూస్తూండిపోయింది.

ఇద్దరూ సంశయంగా, సంకోచంగా ఒకర్నొకరు చూస్తూ వుండిపోయారు. నుదుట బొట్టు లేకుండా విభూది పెట్టుకున్న వసంత అందంగా మెరిసిపోతుంటే సుభద్ర- ఆమె చేసి పంపించిన రకరకాల పచ్చళ్ళు, పొళ్ళు, ఊరగాయలు, అప్పడాలు గుర్తుకొచ్చి అభిమానంగా, రెప్ప వేయకుండా వుండిపోయిన వసంత- చూస్తూండిపోయారు.

***

తెల్లారుతుండగా కరెంట్ పోయింది. విసుగ్గా అటూ ఇటూ పక్క మీద దొర్లుతుండగా బయట తలుపు ఎవరో టకటక కొడుతున్నట్లనిపించి వసంత లేచి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా ఎవరో అపరిచిత వ్యక్తి. చేతిలో చిన్న సూట్‌కేస్‌తో..

''రామం వున్నాడాండీ''

''ఇంకా లేవలేదు. మీరూ..'' అంటూ ఆగింది వసంత.

''రాజా వచ్చాడని చెప్పి లేపండి'' అంటూ లోపలికొచ్చి జోళ్ళు విడిచాడు. అప్పుడు గుర్తుకొచ్చిందామెకి నిన్న భర్త చెప్పిన మాట. అయితే కరెక్టుగా ఎప్పుడొస్తాడో తెలీదు.

''కూర్చోండి లేపుతాను'' అంటూండగా రామం లుంగీ గట్టిగా కట్టుకుంటూ బయటికొచ్చి ''ఏరా! వచ్చేశావా, ఇల్లు ఈజీగానే తెలిసిందా'' అన్నాడు మిత్రుడి దగ్గరికెళ్తూ- ఇద్దరూ కౌగిలించుకున్నారు.

''ఆ.. ఈజీగానే తెలిసింది''

''ఇదిగో వసంతా! వీడు నా ప్రాణ స్నేహితుడు రాజశేఖర్. రాజా నేను ఎలీ

## సాధారణ ప్రచురణ (రూ. 1,000) కు ఎంపికయిన కథ

మెంట్రీ స్కూల్ నుంచి కలిసి చదువుకున్నాం'' అన్నాడు. వసంత అతని వైపు చూసి నవ్వి ''మొహాలు కడుక్కోండి కాఫీ కలుపుతాను'' అంది.

''మీ పెళ్ళికి రావాలని ఎంతో ట్రై చేశాను, కుదరలేదు. ఆ తర్వాత ఇన్నాళ్ళకు గానీ రాలేకపోయాను'' అంటూ తను తెచ్చిన బ్యాగ్ ఓపెన్ చేసి అందులోంచి సీసా తీసి వసంతకిచ్చాడు.

''మా ఆవిడ ఈ గోంగూర పచ్చడి చేయడంలో దిట్ట'' అన్నాడు. వసంత నవ్వుతూ ఆ సీసా అందుకుంది.

ముగ్గురూ ఇడ్లీలు ఆ పచ్చడితోనే తిన్నారు. రాజా ఆఫీసు పని మీద వచ్చాడు. వసంత ఉద్యోగస్తురాలు కావడంతో ఆ భార్యాభర్తలు ఆఫీసుకెళ్ళే హడావిడిలో పడిపోయారు.

''నా భోజనం గురించి పట్టించుకోవద్దు. ఆఫీసు క్యాంటీన్‌లో తినేస్తాను మళ్ళీ రాత్రికే వస్తాను'' అంటూ ముందుగానే చెప్పేసి రాజా తయారై వెళ్ళిపోయాడు.

వసంత, రామం స్నానాలు, వంటలు, బాక్సులు, తాళాలు ముగించుకుని ఎవరి ఆఫీసుకి వాళ్ళు పరుగులు పెట్టారు.

హైద్రాబాద్‌లో రెండు రోజులు పనిచూసుకుని రాజా విశాఖపట్నం వెళ్ళిపోయాడు. వెళ్తూ ఇద్దర్నీ ఒకసారి రమ్మని మరీమరీ చెప్పి వెళ్ళాడు. రాజా వెళ్తుంటే పుల్లారెడ్డి స్వీట్లు కొని ప్రత్యేకంగా సుభద్రకి స్నేహసూచకంగా పంపించింది వసంత.

అప్పుడప్పుడు ఇక్కడి కబర్లు అక్కడికి, అక్కడి కబుర్లు ఇక్కడికీ తెలుస్తూనే వున్నాయి. వాళ్లూ, వీళ్లూ, స్నేహ సమాచారాలు తెలుసుకుని ఆనంద పడిపోతూ కాలం గడుపుతున్నారు.

ఏడాది తర్వాత రామం వాళ్ళక్కయ్య కూతురికి పెళ్ళి సంబంధం కోసం విశాఖపట్నం వెళ్ళినప్పుడు ప్రత్యేకంగా రాజా వాళ్ళింట్లో దిగాడు. అతని భార్య సుభద్ర ఎంతో గౌరవంగా, ప్రేమగా''అన్నయ్యగారూ అన్నయ్యగారూ'' అంటూ రుచికరమైన వంటలు చేసింది ఆరెండు పూటల్లోనూ ''వదిన గారిని తీసుకురావాల్సింది'' అంది.

''వసంతకి డాక్టర్లు బెడ్ రెస్ట్ చెప్పారు'' అన్నాడు రామం కాస్త సిగ్గుపడుతూ, సుభద్ర ఆనందపడిపోతూ ''ఎన్నో నెల?'' అని అడిగింది.

''ఓ వారం అయితే నాలుగు'' అన్నాడు.


రామంకి తిరుగు ప్రయాణంలో ఒక బరువైన సంచి అదనంగా సూట్‌కేసు పక్కన చేరింది. దాన్నిండా ఏవేవో వంటలు, పచ్చళ్ళు అవీ ఇవీ సర్ది ప్రత్యేకంగా వసంత కోసం ఇచ్చింది సుభద్ర.

తరచూ రాజా ఆఫీసు పని మీద హైద్రాబాద్ వచ్చేవాడు. ఏదో ఒక రాచకార్యం కోసం, రామం విశాఖపట్నం వెళ్తూనేవుండేవాడు. ఆవిడకి తోచినవి ఆవిడా, ఈవిడకి తోచినవి ఈవిడా పరస్పరం సరఫరాలు చేసుకుంటూనే వుండేవారు.

వసంత ఎంత నీట్‌గా, అందంగా వుంటుందో, ఆమెంత బాగా వుద్యోగమూ, ఇంటిపని ఏవిధంగా నిర్వహిస్తుందో రాజా భార్యకి వర్ణించి వర్ణించి చెప్పేవాడు.

రామం సుభద్ర చేసే వంటలు, పచ్చళ్ళు, పులుసులు నోరూరిస్తూ కథలు కథలుగా చెప్పేవాడు వసంతకి.

ఇద్దరూ ఆ కబుర్లు విని ఎంతో సంతోషపడిపోయేవారు. ఏళ్ళు గిర్రున తిరిగి పోయాయి. వసంత కూతురు పన్నెండో ఏట






పెద్ద మనిషైంది. వసంత సుభద్రకి కబురు చేసింది ఏమైనా సరే రావాలని– ఆమె కూడా ఏది ఏమైనా వెళ్ళాలనే అనుకుంది. కానీ అప్పుడే సరిగ్గా సుభద్ర కొడుక్కి సెవెన్త్ క్లాస్ ఎగ్జామ్స్.. అంతే ప్రయాణానికి బ్రేక్ పడింది. చక్కని బంగారు రింగులు కొని భర్తకిచ్చి పంపింది సుభద్ర.

ఆఫీసు పని కల్పించుకుని ఆఘమేఘాలమీద వెళ్ళాడు రాజశేఖర్.

''ఆడవాళ్ళ విషయం రా ఇది, చెల్లాయిని పంపమంటే నువ్వొచ్చావేమిటీ పోతు పేరంటాళ్ళా'' అని రామం గేలి చేసినా రాజా పెద్దగా పట్టించుకోలేదు.

''ఆడాళ్ళు ఇల్లు కదలడమంటే అంత సులువుకాదురా? వాళ్ళు ఒక్క రోజు లేకపోతే మన పని ఖాళీ'' అంటూ పెద్ద ఉపన్యాసం దంచాడు.

అత్తగారికి అన్నీ చూడటానికి వుండాలి, పిల్లలకి పరీక్షలైతే వుండి తీరాలి. భర్తకి ఆఫీసులో వర్క్ ఎక్కువగా వుంటే భార్య ఇంటి దగ్గర వేళకి, వేడివేడిగా అమర్చి పెట్టడానికి తప్పక వుండాలి. ఇంట్లో ఎవరికి బాగుండకపోయినా, ఇల్లాలుగా, కోడలిగా, తల్లిగా, భార్యగా సరేసరి, ఆమే వుండే తీరాలి. ఆమె బాధ్యత కొంచెం సమయమైనా ఎవ్వరూ తీసుకోరు.

అబ్బే! అది ఎవరివల్లా కాదండీ.. ఎవ్వరూ ఆ పాత్ర నిర్వహించలేరు అని అందరూ తరచూ చెప్తూ అదే ప్రపంచం నడవడానికి ఏకైకమార్గం అని ఎలుగెత్తి చాటుతూ వుంటారు.

ఆమె కూడా అదేనమ్మి, అలాగే బరువంతా మోస్తూ, అదంతా ప్రకృతి సహజంగా అభివర్ణించుకుంటూ గడిపేస్తుంది.

''నేను లేకపోతే ఒక్క క్షణం కూడా గడవదు ఇంట్లో'' అంటూ సగర్వంగా ప్రకటించి, ఉత్తమ ఇల్లాలి కేటగిరిలోకి చేరిపోతూ వుంటుంది.

రాజా కొడుకు మహేష్‌కి వడుగు చేసినప్పుడు సుభద్ర కూడా చాలా పట్టుబట్టింది వసంత రావాలని,అయితే సుభద్రకున్న అన్ని బాధ్యతలతో బాటుగా వసంతకి ఉద్యోగం అదనపు బరువుకావడంతో కదల్లేకపోయింది.

## రచయిత్రి పరిచయం



ఆర్టీసీలో స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన నేను కరిగిన హరివిల్లు, విశాల ప్రపంచం, వెన్నెల మట్టి, ఆవలితీరం, నీలిరాగం, నిజానికీ అబద్ధానికీ మధ్య, మాతృ బంధం, సజలనేత్రి, కనిపించే గీతం.. వగైరా 11నవలలు రాశాను. వీటితో పాటు ఎన్నో కథా సంకలనాలు వెలువడ్డాయి. నేను రాసిన కథలు ఇంగ్లీషు, హిందీ, తమిళం, కన్నడ భాషల్లోకి అనువదించబడ్డాయి. ఆకాశవాణిలో ఎన్నో సంగీత కార్యక్రమాల్లో పాల్గొన్నాను. లలిత గీత మాలిక, శివాక్షర మాల అనే రెండు ఆల్బమ్‌లను విడుదల చేశాను. ప్రైవేట్ టీవీ ఛానెల్స్, రేడియో స్టేషన్స్‌లో వివిధ కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నాను. అమెరికా తెలుగు కథా సంకలనం (2002)కి సహ సంపాదకత్వ బాధ్యతలు నిర్వర్తించాను. సాహిత్యంలో ఎన్నో పురస్కారాలు అందుకున్నాను. నవ్యవీక్లీ-సి.పి.బ్రౌన్ అకాడమీ వారు నిర్వహించిన కథల పోటీలో నా కథను బహుమతికి ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు.

—ఇంద్రగంటి జానకీబాల

ఆడపిల్ల చదువు, భర్తగారి పూర్తి బాధ్యత, అత్తగారి బరువుతో పాటు ఆమెకి ఆఫీసులో ఆడిట్‌లు, పేమెంట్లు, ఓవర్‌టైములు లాంటివి సర్దుకోవడం పెద్ద కసరత్తే అయింది. అందుచేత సహజంగానే వసంత, రాజశేఖరం– సుభద్రల కొడుకు మహేష్ ఉపనయనానికి వెళ్ళలేకపోయింది.

రామం మాత్రం చక్కటి టైటాన్‌వాచ్ ఒకటి కొని, చిన్న బ్యాగ్ సర్దుకుని టింగ్‌మని వెళ్ళి, టంగ్‌మని వచ్చేశాడు.

వీళ్ళ గృహప్రవేశానికి, వాళ్ళ పెద్దమ్మాయి పెళ్ళికీ ఆడవాళ్ళు అంగుళం కదల్లేక ఎక్కడి వాళ్ళక్కడే వుండిపోయారు. బహుమతులు భర్తలు తీసుకెళ్ళి భార్యల తరపున బాధ్యత స్వీకరించి స్నేహాన్ని నెరిపి మరింత పటిష్ఠం చేశారు.

ఈ సర్దుబాట్లలో తండ్రితో కలిసి ఒకసారి లలిత రాజా, సుభద్రల ఇంటికి వెళ్ళి రెండురోజులుండి వచ్చింది. వచ్చినప్పటి నుంచీ సుభద్రత్తయ్య గురించి, రాజా మావయ్య గురించీ, వాళ్ళబ్బాయి మహేష్ గురించీ, అమ్మాయి సునీత గురించీ తెగ చెప్పింది. వసంతకి ఒక్కసారి వెళ్ళి సుభద్రతో స్నేహంగా రెండు రోజులు గడిపిరావాలని ఎంతగానో అనిపించింది, కానీ కుదరలేదు.

కాలం గిర్రున తిరిగి పోవడం దాని ధర్మం. ఎప్పుడు వసంతని తలుచుకున్నా ప్రాణస్నేహితురాల్ని జ్ఞాపకం చేసుకున్నట్లు మనసు పులకించిపోయేది సుభద్రకి. అదేమీ చిత్రమో గానీ వసంతకీ అంతే.. దూరవిద్య అన్నట్లుగా వారి మధ్య దూర మైత్రి మిగిలింది. మరంతే కదా! స్త్రీలకన్నీ పురుషుల ద్వారానే సాధ్యం. సంసారమనేది రెండు చక్రాల బండనీ, దానికి భార్యాభర్తలు చక్రాలనీ అదనీ ఇదనీ చక్కని ఉదాహరణలు చెప్తారు. ఇద్దరూ సమానులే అంటారు. నిజమే ఇద్దరూ సమానులే అయితే పురుషులు కొంచెం ఎక్కువ సమానులు.. వారికి ఈ సంసారం వల్ల, పిల్లల వల్ల, తమ తల్లిదండ్రుల వల్ల, భార్యవల్ల వారి పనులు, వారి సరదాలు, సంతోషాలు ఏవీ ఆగిపోవు. వారి స్నేహాలు సజావుగా సాగిపోతూనే వుంటాయి.

మిలిట్రీలో అభిప్రాయాలకీ, అభీష్టాలకీ తావుండదు. ఆజ్ఞలను స్వీకరించి పాటించటమే. మన ఇళ్ళల్లో స్త్రీలు మిలటరీలో సోల్జర్స్ లాంటి వాళ్ళు.

యాభై రెండేళ్ళకే మాసివ్ హార్ట్ ఎటాక్ వచ్చి రామం పోయినప్పుడు వసంతని చూడాలని, ఓదార్చాలనీ సుభద్ర బయలుదేరింది. కానీ మంచంలో వున్న అత్తగారిని చూసే వాళ్ళెవరూ లేకపోయారు.

''చుట్టాలేం కాదుట, ఒట్టి స్నేహితులు'' అత్తగారిని చూడాల్సిన బాధ్యత కోడలిదే కదా! ఆ విషయంలో ఆమె కొడుకు కూడా స్వేచ్ఛా జీవే!

సుభద్ర రావడం గురించి ఆలోచించకుండానే, ఆమె వీలు చూడకుండానే రాజా హుటాహుటిన వెళ్ళిపోయాడు.

''ఆమె మంచిగా, శుభంగా వున్నప్పుడు చూడనే లేకపోయాను. ఇప్పుడే ముఖం పెట్టుకుని పరామర్శకి వెళ్తాను? మరొకప్పుడు నెమ్మదిగా వెళ్తానులే'' అని తనే సరిపెట్టుకుంది సుభద్ర.

ఆరు నెలలు తిరక్కుండానే స్కూటర్ యాక్సిడెంట్‌లో రాజశేఖర్ పోయినప్పుడు వసంత కూడా సుభద్రలాగే విలవిల్లాడిపోయింది. కూతురి ఎంసెట్ పరీక్షలు..అట్లాసు రాక్షసుడి భుజం మీద నుంచి అరనిముషం భూభారాన్ని మార్చుకునే వారు లేనట్లే వసంత కదల్లేకపోయింది.

***

లలిత సుభద్ర చేతులు పట్టుకుని తల్లి వైపు నడిచింది. వసంత నాలుగడుగులు ముందుకేసింది. ఇద్దరూ మధ్యలో కలుసుకున్నారు.

ఒకరి చేతులు ఒకరు పట్టుకుని కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. ఆప్యాయతతో, స్నేహంతో వారి హృదయాలు కరిగిపోయాయి. ఇద్దరి చెంపల మీద కన్నీరు జారింది.

పిల్లలిద్దరూ కబుర్లలోపడ్డారు.

''ఎన్నాళ్ళగానో అనుకుంటూ, ఇన్నాళ్ళకి దైవ సన్నిధిలో మిమ్మల్ని కలిశాను'' అంది సుభద్ర.

''నేనూ అదే అనుకుంటున్నా.. ఇందుకే ఈ అన్నవరం ప్రయాణం కుదిరిందేమో'' అంది వసంత.

అంతే– ఇద్దరూ ఏళ్ళుగా మనస్సులో మరుగునపడిపోయిన కబుర్లన్నీ చెప్పుకుంటూ అశ్రమంగా కొండ మెట్లెక్కారు.

''ఎప్పుడు మీ ప్రయాణం?'' అంది సుభద్ర.

''రేపు రాత్రికి.. రిజర్వేషన్ కూడా అయిపోయింది'' అంది వసంత.

ఇంతలో మహేష్ కల్పించుకుని ''రిజర్వేషన్లు ఎప్పుడూ అయిపోతూనే వుంటాయి. నేను అన్నీ చూస్తాను. మీరిటు మాతో వైజాగ్ వచ్చి ఆ తర్వాత వెళ్తారు'' అన్నాడు.

''అవును. అన్నీ మహీ చూస్తాడు. మీరు రావాల్సిందే'' అంది సుభద్ర. మెరుస్తున్న కూతురు లలిత కళ్ళల్లోకి చూస్తూ'' సరే మీ ఇష్టం'' అంది వసంత.

''ఇంత దగ్గర్లో వున్నా– ఇన్నేళ్ళుగా రావడమే కుదరలేదు. ఆడవాళ్ళం కదా, ఇల్లు వాకిలీ వదిలించుకురావడం కష్టం'' అంది సుభద్ర.

''మన సొంతానికి స్నేహమూ లేదు, దేవుడు లేడు'' అంది వసంత వినీవినిపించనట్లుగా.

దర్శనం టిక్కెట్లు కొనేందుకు మహేష్, లలితా పరుగెట్టారు.

★



## బరువు తగ్గుతోన్న నయనతార

సినిమాల్లో కొంచెం లావుగా, ఫ్లెషీగా కనిపించే నయనతారని ఇటీవల బయట చూస్తే 'అరె! బలే సన్నగా ఉందే' అనిపిస్తోంది. ఈ తేడా ఎలా సాధ్యం అంటే... మనసుని ప్రశాంతంగా ఉంచుకోమని వాళ్ళమ్మగారు చెప్పిందట! అప్పటి నుంచి నయనతార మనసుని ప్రశాంతంగా ఉంచుకోవడంతో పాటు కాస్త డైటింగ్ కూడా చెయ్యడంతో సన్నబడిందట! పదిహేను రోజులకే చాలా తేడాగా కనిపిస్తోంది ఈ మలయాళీ బ్యూటీ.